క్లుప్తంగా

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): మెంగారం గ్రామానికి చెందిన చిన్ననాటి బాల్య మిత్రుడు ఆకుల నాగరాజు అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. దాంతో 1999–00 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు కలిసి మృతుని భార్య స్వప్న, ఇద్దరు కుమారులు అజయ్, నితీష్‌లకు రూ. 31 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మోహన్‌సింగ్, భాను, మహేందర్ రెడ్డి, వంశీ, ఈశ్వర్, సిద్దు, దేవిసింగ్, షబ్బీర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీజీవీపీ నేతల అరెస్టు



భిక్కనూరు: సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి జిల్లా పర్యటనకు రావడంతో ముందు జాగ్రత్తగా భిక్కనూరు మండల కేంద్రంలో టీజీవీపీ నేతలను పోలీసులు గురువారం వేకువజామున అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు గంధం సంజయ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సమీర్‌ల ఇండ్ల వద్దకు పోలీసులు గురువారం వేకువజామున వెళ్లి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



రాజంపేట: మండలంలోని ఎల్లాపూర్ తండా, దూప్‌సింగ్ తండా, నడిమి తండాలలోని వరద బాధితులకు హైదరాబాద్‌కు చెందిన సీఎంఆర్ ఐటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. వరద బాధితులకు అండగా నిలిచి బియ్యం, పప్పులు, కూరగాయలు, పండ్లు పంచడంతో పాటు హెల్త్ క్యాంపు నిర్వహించారు. సీఎంఆర్ ఐటీ కళాశాల డైరెక్టర్ డా. జంగారెడ్డి, ప్రిన్సిపాల్ మధుసూదన రావ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, శివక్రిష్ణ, గుంజన్, సుప్రియ, నిహారిక, లోహిత, తండా పెద్దలు పాల్గొన్నారు.

సేవలు అందించడం అభినందనీయం



భిక్కనూరు: సింగిల్ విండోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జంగంపల్లి గ్రామానికి చెందిన చకిలం శ్రీనివాస్‌ను గురువారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. విండో సీఈవోగా శ్రీనివాస్ రైతులకు ఎనలేని సేవలను అందించడం అభినందనీయమని సంఘం నేతలు అన్నారు.. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గరిపల్లి సిద్దరాములు, గ్రామ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి జీపీ నాగరాజు, ప్రతినిధులు రమేష్, శ్రీనివాస్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు..అన్నదానం



పిట్లం(జుక్కల్)/నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సంఘం వినాయకుడి వద్ద మాజీ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు వడ్డించారు. మండపం వద్ద స్థానికులతో కలిసి భోజనం చేశారు. గురువారం వినాయకులను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చెరువులలో నిమజ్జనం చేశారు. అంతకుముందు నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లిలో గల షిర్డీ సాయి ఆలయంలో, నస్రుల్లాబాద్‌లో గల సీతా రామాలయంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు.



రామారెడ్డిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



కాచాపూర్‌లో యూరియా బస్తాల కోసం రాళ్లు, చెప్పలను క్యూలో పెట్టిన రైతులు

ఇంకా తీరని యూరియా ఇక్కట్లు

జిల్లాలో యూరియా ఇక్కట్లు ఇంకా తీరలేదు. రైతులు సొసైటీల ముందు తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్నారు. సొసైటీల వద్దకు చేరుకుని క్యూలైన్లలో చెప్పులు, పాసుబుక్కులు పెట్టి పక్కన కూర్చుంటున్నారు. కొన్ని చోట్ల టోకెన్లు పంపిణీ చేసి ఆ ప్రకారం యూరియా సరఫరా చేస్తున్నారు. సరిపడేంత యూరియా అందుబాటులో లేకపోవడంతో ఒకరికి ఒక్క యూరియా బస్తా చొప్పున అధికారులు పంపిణీ చేస్తున్నారు. యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహమ్మద్ నగర్ రైతు వేదిక వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు



మాచారెడ్డి సింగిల్‌విండో వద్ద బారులు తీరిన మహిళలు



రాజంపేట సొసైటీ వద్ద..

రాజంపేటలో 5 వేల ఎకరాల్లో పంట నష్టం

- వరద ధాటికి కొట్టుకుపోయిన పంటలు
- నష్ట పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటున్న రైతులు



ఎల్లాపూర్ తండాలో వరద ధాటికి దెబ్బతిన్న వరి పంట

రాజంపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో భారీ మొత్తంలో పంట నష్టం జరిగింది. ఏ రైతును కదిలించినా కన్నీరే ఉబికి వస్తోంది. మండలంలో వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. 2,974 ఎకరాల్లో వరి, 2,322 ఎకరాల్లో మొక్కజొన్న పంట, 128 ఎకరాల్లో పత్తి, ఇతర పంటలతో కలిపి సుమారు 5,545 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు ఏవో శృతి పేర్కొన్నారు. పంట నష్ట పరిహారం కోసం సంబంధిత క్లస్టర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని తెలపడంతో రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

పంటలు నాశనమయ్యాయి



భారీ వర్షాలకు పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి. నేను మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. భారీ వర్షం, వరద ఉధృతికి రెండు ఎకరాల పంట పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– చింతల సుదర్శన్, రైతు, రాజంపేట

మొత్తం కొట్టుకుపోయింది



రెండు రోజుల క్రితం వరద ఉధృతికి తండాలో పంటలన్నీ నాశనం అయ్యాయి. మేము వ్యవసాయం చేస్తేనే నోట్లోకి కూడు పోతుంది. తండాలో పరిస్థితి చాలా దయనీయ పరిస్థితి నెలకొంది. వరద ఉధృతిలో ఒక ఎకరం వరి పంట మునిగిపోయింది. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఇస్లావత్ బుజ్జి, రైతు, ఎల్లాపూర్ తండా

నాణ్యమైన విద్య బోధించడానికి టీఎల్‌ఎం అవసరం



లింగంపేట(ఎల్లారెడ్డి): నాణ్యమైన విద్యను అందించడానికి బోధనాభ్యాసన సామగ్రి ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి షౌకత్‌అలీ అన్నారు. గురువారం లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఆసక్తికరంగా బోధించడానికి ఉపయోగించే వివిధ రకాల సామగ్రిని ప్రదర్శించి వివరించారు. సబ్జెక్టుల వారీగా ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో గురువారం స్థానిక ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని దొంగతనాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు. ఈ మేరకు ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతుగా రూ.20 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన కిరాణ, వ్యాపార సముదాయాలు, గ్రామ పెద్దలు తమ వంతు సహాయం అందించారు. గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు, ట్రాక్టర్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రారం గణేశ్ యాదవ్, తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



లింగంపేటలో అరెస్ట్ చేసిన బీఆర్‌ఎస్ నేతలు



గాంధారి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు



కామారెడ్డిలో బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ నేతలు



రామారెడ్డిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

సాక్షి నెట్‌వర్క్: లింగంపేట్, కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లాలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులను ముందు జాగ్రత్తగా గురువారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేశారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టుచేసి సీఎం పర్యటన అనంతరం విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. సీఎం రైతుల కష్టాలు, పంటల నష్టం పరిశీలించడానికి వస్తే తాము ఎందుకు అడ్డుకుంటామన్నారు. రైతులను న్యాయం జరగాలని తాము కూడా కోరుకుంటున్నామన్నారు. ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు చోట్ల బీఆర్‌ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు కోమట్‌పల్లి గ్రామంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి భవన నిర్మాణ కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు సంక్షేమ పథకాలను రెండింతలు పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాద బీమాను రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలు, సాధారణ మరణం రూ.1.30 లక్షల నుంచి రూ.2.30 లక్షలకు, శాశ్వత అంగ వైకల్యంకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, పాక్షిక అంగ వైకల్యానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచినట్లు వారు పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బండిపై గణేష్ విగ్రహ శోభాయాత్ర



సదాశివనగర్ (ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురువారం బీసీ కాలనీలో ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహాన్ని ఎడ్ల బండి పై నిలిపి నిమజ్జనానికి తరలించారు. భక్తిశ్రద్ధలతో గణేష్ విగ్రహాన్ని ఎడ్ల బండి పై తరలించడానికి చూసిన ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఎల్‌ఐసీ ప్రగతికి ఏజెంట్లే మూల స్తంభాలు

- ముగిసిన బీమా వారోత్సవాలు



సీనియర్ అడ్వైజర్ కాసర్ల శంకర్‌ను సన్మానిస్తున్న మేనేజర్ కృష్ణమోహన్

కామారెడ్డి అర్బన్: భారతీయ జీవితబీమా సంస్థ(ఎల్‌ఐసీ) ప్రగతికి దేశంలోని దాదాపు 15 లక్షల మంది ఏజెంట్లు మూల స్తంభాలుగా ఉన్నారని, వారి సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నట్టు ఎల్‌ఐసీ కామారెడ్డి శాఖ మేనేజర్ ఎస్.కృష్ణ మోహన్ అన్నారు. ఎల్‌ఐసీ 69వ బీమా వారోత్సవాల ముగింపు సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. 35 ఏళ్లుగా సేవలు అందిస్తున్న సీనియర్ ఏజెంట్ కాసర్ల శంకర్‌ను ఘనంగా సన్మానించారు. వారోత్సవాల సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అధికారులు శ్రీనివాస్‌రావు, నేతలు ఎల్.కిషోర్‌చంద్, టి.మోహన్, రాజారెడ్డి, బాల్‌కిషన్, భగవంత్‌రెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పంటల పరిశీలన



బంగారువాడిలో సోయా పంటను పరిశీలిస్తున్న ఏవో రాజలింగం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని బంగారువాడి, పిప్కిల్ గుట్ట శివారులో గురువారం పర్యటించి క్షేత్రస్థాయిలో సోయాబీన్, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించినట్లు ఏవో రాజలింగం తెలిపారు. పంటలను ఏఈవో విఘ్నేశ్వర్, సంబంధిత రైతులతో కలిసి పరిశీలించి వివరాలు సేకరించినట్లు చెప్పారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): ఖ్కడ్‌పల్లి, దౌల్తాపూర్, బిచ్కుంద శివారులో వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దర్పల్ గంగాధర్ ఇతర నేతలతో కలిసి పరిశీలించారు. పంట నష్టం వివరాలను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు.. సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందిస్తారని వారు అన్నారు. అధికారులకు పంట నష్ట వివరాలు తెలియజేయాలని రైతులను కోరారు. ఏఈవో శ్రీరేఖ, ఏఎంసీ డైరెక్టర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

మద్నూర్(జుక్కల్): రైతులు తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో ప్రియాంక కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఏఈవోలు రైతుల వేసిన పంట వివరాలను సేకరించారు. ఆ వివరాలు ఆన్‌లైన్ చేస్తామని వారు తెలిపారు.



బిచ్కుంద శివారులో సోయా పంటను పరిశీలిస్తున్న నాయకులు

పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటాం

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో వర్షాలు, వరదలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు అవసరమైన సామగ్రి కిట్లను గురువారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన అభ్యర్థన మేరకు బాలవికాస, అమెజాన్ సంస్థలు సంయుక్తంగా పేదల కోసం 500 కిట్లు పంపారన్నారు. ఈ కిట్‌లో ఇళ్లపై కప్పుకునేందుకు టార్పాలియన్ కవర్‌లు 2, దోమ తెర, బస్తా, బకెట్, సబ్బులు, ఇతర సామగ్రి ఉంటాయన్నారు. దాదాపు రూ.9 లక్షల విలువ గల కిట్లు జిల్లా కేంద్రంలో పంపిణీ చేశామని తెలిపారు. నియోజకవర్గంలో పేదలను ఆదుకునేందుకు అన్ని విధాల కృషి చేస్తానని చెప్పారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువుకు కావాలనే గండి కొట్టారా?



గండి పడ్డ భిక్కనూరు దాసన్నమ్మ కుంట చెరువు

భిక్కనూరు: మండల కేంద్రంలోని దాసన్నమ్మ కుంట చెరువులోకి నీరు పుష్కలంగా రావడంతో తమకు నష్టం వాటిల్లుతుందని భావించి గత నెల 27న చిన్న ప్రొక్లెయిన్ సాయంతో గండి కొట్టారని మండల కేంద్రంలో పలువురు అంటున్నారు. అలుగెళ్లడానికి ఇంకా సమయం ఉండగా కొందరు వ్యక్తులు చిన్న ప్రొక్లెయిన్‌ను తీసుకొచ్చి కుంట కట్టకు గండి కొట్టించారని పలువురు అనుమానిస్తున్నారు. కట్ట చాలా గట్టిగా ఉండేదని.. తాము 27న ఉదయం 9 గంటల ప్రాంతంలో వచ్చి చూశామని అప్పుడు బాగా ఉన్న కట్ట సరిగ్గా 10 గంటల ప్రాంతంలో తెగిపోయిందని సమాచారం అందిందని.. సమీపంలో ఉన్న గిద్ద దళితవాడకు చెందిన కాలనీవాసులు చెబుతున్నారు. ఈ కట్టను మండల కేంద్రానికి చెందిన కొందరు తమ ఇళ్లలోకి నీరు వస్తుందనే ఉద్దేశంతో కట్ట తెగ్గొట్టారని మండల కేంద్రంలో పలువురు బాహాటంగా అంటున్నారు. ఈ కట్టను తెంపడం వల్ల కట్ట కింద ఉన్న రైతుల పంటలు మునిగిపోవడంతో పాటు రామేశ్వర్‌పల్లి–భిక్కనూరు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. నీరు జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్దకు రావడంతో ఆరు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ విషయం గురించి భిక్కనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెచ్‌ఈవో రవి, ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఆరోగ్య కార్యకర్త మీన, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వసతిగృహంలో పరిశుభ్రత పాటించాలి



రామారెడ్డి: వసతి గృహాల్లో ప్రతిచోట కచ్చితంగా శుభ్రతను పాటించాలని, నీళ్ల నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రామారెడ్డి ప్రభుత్వ వైద్యాధికారి సురేష్, ప్రిన్స్‌పాల్‌కు సూచించారు. రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని గురువారం డాక్టర్ సురేష్ సందర్శించారు. వంటశాల, వాటర్ ప్లాంట్ చుట్టు పక్కల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

జాతీయ కంటి దినోత్సవం

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో గురువారం జాతీయ కంటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యులు రవీందర్.. కళ్ల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ కంటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని, మనిషికి జీవితంలో కళ్లు చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక చేపట్టారు. 12టీ బెటాలియన్ నిజామాబాద్ కమాండింగ్ ఆఫీసర్ ప్రయాజిత్ సుర్ ఆధ్వర్యంలో 150 విద్యార్థులు పాల్గొనగా వారిలో 15 మందిని ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. శారీరక దృఢత్వంతో పాటు రాత పరీక్ష నిర్వహించి ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టారు. ప్రిన్సిపల్ గంగాధర్, సీటీవో రమావత్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.